క్లుప్తంగా

పంటలను ధ్వంసం చేస్తున్న కోతులు



సిరికొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను కోతులు విపరీతంగా ధ్వంసం చేస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు గడ్కోల్, తాళ్లరామడుగు, పెద్దవాల్గోట్, హుస్సేన్‌నగర్, తూంపల్లి, కొండాపూర్ తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. కోతులు గుంపులు గుంపులుగా పంట చేలల్లోకి చొరబడి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వరి, మొక్కజొన్న, సోయా గింజలను తెంపుకొని పాడుచేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను అరికట్టాలని అటవీ శాఖ అధికారులకు అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా గుంతలు



సిరికొండ: మండల కేంద్రం నుంచి భీంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రహదారిపై చిన్నగా ఉన్న గుంతలు గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పెద్దగా మారాయి. గుంతలకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. పెద్ద పెద్ద గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సిరికొండ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కొండూర్ కప్పలవాగు వద్ద కోతకు గురవడంతో జిల్లా కేంద్రానికి న్యావనంది చౌరస్తా మీదుగా రాకపోకలు నడుస్తున్నాయి. దీంతో ఈ మార్గం చాలా రద్దీగా మారింది. రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు గ్రామానికి చెందిన గోపిడి రవీందర్‌రెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లో గత ఇరవై ఏళ్లుగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న రవీందర్‌రెడ్డి విద్యార్థులకు రూ. 40 వేల విలువ గల దుస్తులను వితరణ చేశారు. జాతీయ స్థాయి బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించిన రవీందర్‌రెడ్డి కూతుళ్లు స్నిగ్ధరెడ్డి, సాన్విరెడ్డిలను పాఠశాలలో గ్రామస్తులు అభినందించారు. సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, జలంధర్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, వీడీసీ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం రాములు, టీచర్లు లచ్చన్న, శ్రీనివాస్ రెడ్డి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన మేకల శేఖర్ ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తూ.. ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామానికి చెందిన పలువురు మృతుడి కుటుంబ సభ్యులకు చేయూతనందించారు. నెల రోజులకు సరిపడా వంట సామగ్రి, రూ.11600 నగదును గ్రామంలో వారికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో వి రమణయ్య, ఎస్ భూమన్న, వి శ్రీనివాస్, ఎస్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,23,500	వెండి(కిలో)	1,57,000
22 క్యారెట్స్	1,14,127		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు


చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	40	80	దోసకాయ	30	60
దొండకాయ	40	80	ఆలుగడ్డ	30	60
బీర్నీసుకాయ	40	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	80	గోబిపువ్వు	40	80
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	80	160	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	50	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	50	90
క్యాప్సికం	50	100			-సుభాష్‌నగర్



గాజుల్‌పేట్‌లో తొమ్మిది రూపాలతో ఉన్న అమ్మవారి ఊరేగింపు



గాయత్రినగర్‌లో..



డిచ్‌పల్లిలో..

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో, నగరంలో రెండవ రోజూ దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలు కొనసాగాయి. శుక్రవారం రాత్రి ప్రారంభమైన శోభయాత్ర లు శనివారం రాత్రి వరకు కొనసాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో దుర్గామాత విగ్రహాలను భవానీ మాలధారణ స్వాములు, మహిళలు, భక్తులు ఉత్సాహంగా ఆటపాటలతో ఊరేగింపుగా తీసుకెళ్లి బాసర వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

– డిచ్‌పల్లి/నిజామాబాద్ రూరల్



మార్కండేయ మందిరం వద్ద పూజల్లో పాల్గొన్న ఈరవత్రి అనిల్, మానాల, ఏసీపీ, కేశవేణు



ఒగ్గుడోలు కళాకారుల విన్యాసం




గాజుల్‌పేట్‌లోని అమ్మవారి ఊరేగింపులో నృత్యం చేస్తున్న యువతులు





న్యాల్‌కల్ రోడ్డు వివేకానంద కాలనీలో అమ్మవారి వద్ద యువతులు, మంగళహారతులతో మహిళలు



ఆర్‌ఆర్ చౌరస్తాలో తరలుతున్న అమ్మవారు

ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పలువురి పరామర్శ



లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఎమ్మెల్యే తల్లి లక్ష్మీనర్సమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుప్పాల శోభ, బ్రహ్మ కుమారి సుజాత, పలు పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు శనివారం భూపతిరెడ్డిని పరామర్శించారు. అనంతరం లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకుల వెంట రూరల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సిరికొండ: మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే తల్లి లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు ఎర్రన్న, గాదారి నర్సారెడ్డి, రాంరెడ్డి, బుచ్చన్న, కిషోర్‌గౌడ్, రాంసింగ్, సంతోష్‌నాయక్, గౌసొద్దీన్, సంతోష్‌నాయక్, నర్సయ్య, సామేల్, రమేష్, భాస్కర్, గంగారెడ్డి, దాసు, ప్రసాద్, నాని, ప్రవీణ్ రెడ్డి తదితరులు కలిశారు.

నూత్‌పల్లి జాతరకు వేళాయే!

- రేపటి నుంచి రాజరాజేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లలో నిమగ్నమైన గ్రామస్తులు



నూత్‌పల్లిలోని శివాలయం

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లిలో ఐదు రోజుల పాటు జరిగే శ్రీ రాజరాజేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈగుడిలోని శివలింగాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. ప్రతి ఏటా అక్టోబర్‌లో నిర్వహించే స్వామివారి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. ఈ క్రమంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ, గ్రామస్తులు కలిసి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గుడికి రంగులు వేసి విద్యుత్ దీపాల అలంకరణ పనిలో ఉన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డుపై గుంతలను పూడ్చారు. పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. 6న స్వామి వారి ఊరేగింపు, కల్యాణం, 7న అమ్మవారి బోనాలు (సలనంబర్లు), 8న అన్నదానం, రథోత్సవం, 9న స్వామివారికి నైవేద్యాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 10న నాగవెల్లి, పల్లకీసేవ నిర్వహించనున్నారు.

జాతర ఎంతో ప్రత్యేకం



ఏడాదికోసారి జరిగే రాజరాజేశ్వర స్వామి జాతర ఎంతో ప్రత్యేకం. విశిష్టత కలిగిన శివలింగానికి నిత్యాభిషేకం, దూపదీప నైవేద్యాలు సమర్పిస్తాం. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. రథోత్సవం వైభవంగా జరుగుతుంది.

– బాపయ్య, ఆలయ పూజారి

ఎస్సారెస్పీని సందర్శించిన విమలక్క

బాల్కొండ: అరుణోదయ కళాకారిణి విమలక్క శనివారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ నిర్మాణ వివరాలను, వరదలు, నీటి విడుదలను గురించి ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపు హౌజ్‌లను పరిశీలించారు. ఆమె వెంట ప్రాజెక్ట్ వరద కాలువ డిప్యూటీఈఈ గణేష్, అరుణోదయ కళాబృందం తదితరులున్నారు.



మానవ హక్కుల, నేర నిరోధక సంఘం జిల్లా కార్యదర్శిగా మహేశ్ కుమార్

నిజామాబాద్ నాగారం : మానవ హక్కుల - నేర నిరోధక సంఘం సభ్యుడిగా పుల్గం మహేష్ కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి, సంఘం జాతీయ అధ్యక్షుడు బోడో రాకేష్ నాయక్ (హైకోర్టు న్యాయవాది) పుల్గం మహేశ్ కుమార్‌ను నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన ఏ కార్యాలయంలోనైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే, బాధితులు మానవ హక్కుల సంస్థను ఆశ్రయిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

ప్రజావాణి రద్దు

నిజామాబాద్‌అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున ఎన్నికల కోడ్ ముగిసేవరకు ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఆర్మూర్ సబ్ కలెక్టర్‌ను కలిసిన టీఆర్‌ఈఎస్‌ఏ బృందం



ఆర్మూర్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఆర్‌ఈఎస్‌ఏ) ఆర్మూర్ డివిజన్ అధికారులు, సిబ్బంది ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాను శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు పి.శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ డీ.భరత్, కోశాధికారి ఎం.అరవింద్, అసోసియేట్ అధ్యక్షుడు పి.విక్రమ్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

ముగిసిన సర్కిల్ క్రికెట్ టోర్నీ



ట్రోఫీని అందిస్తున్న నిర్వాహకులు

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. టోర్నమెంట్‌లో గెంజ్ టీం ప్రథమ, జీకేఆర్ఎస్ ద్వితీయ, ఆర్‌జీవై టీం మూడవ బహుమతి పొందారు. విజేతలకు బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మొండి అశోక్ బహుమతు లు అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ మదన్, శ్రీకాంత్, నరేశ్, డెని, సాయి, విష్ణు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కప్పలవాగుతో రైతులకు చిక్కులు



గడ్కోల్‌లో కోతకు గురైన భూమి

- చెక్ డ్యాం గట్లు తెగి కోతకు గురైన భూమి
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



కోతకు గురైన భూమిని చూపుతున్న రైతు గంగారం

సిరికొండ: కప్పలవాగు తన సమీపంలోని వ్యవసాయ భూములకు సంబంధించిన రైతులకు చుక్కలు చూపెడుతోంది. భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహించడంతో చెక్ డ్యాం గట్టు తెగిపోయి ఎకరాల భూమి కోతకు గురైంది. దీంతో పంట కోల్పోయిన అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి గడ్కోల్ గ్రామంలో కప్పలవాగుపై నిర్మించిన చెక్ డ్యాం గట్టు తెగిపోవడంతో కట్ట చిన్న గంగారంకు చెందిన రెండెకరాల భూమి, పెండ్లి రాములుకు చెందిన ఎకరం భూమి పూర్తిగా కోతకు గురైంది. ఒక విద్యుత్ స్తంభం లోతుతో భూమి ఏమి లేకుండా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. బోరు కొట్టుకుపోయింది. చెక్ డ్యాంకు ఇరువైపులా మొరంతో గట్టు ఎత్తుగా పోసి రోలింగ్ చేయించి గట్టుకు బండ రాళ్లతో తెట్టె నిర్మించాలి. అలా చేయకుండా గట్టుకు కేవలం కొద్ది మేర మట్టిపోసి వదిలేశారు. దీంతో భారీ వర్షానికి వరద ఉధృతంగా రావడంతో బలహీనంగా ఉన్న గట్టు తెగిపోయి భూమి, పొలం కొట్టుకుపోయింది. గట్టు తెగిపోవడంతో వరద నీరు పూర్తిగా అటు వైపు నుండే పారుతోంది. అదే భూమిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. మిషన్ కాకతీయలో భాగంగా 2020 సంవత్సరంలో చెక్ డ్యాంను నిర్మించారు. మరుసటి ఏడాది 2021 జూలైలో కురిసిన భారీ వర్షానికి చెక్ డ్యాం గట్టు తెగిపోయి దాని పక్కనే గల కట్ట చిన్న గంగారం, పెండ్లి రాములుకు చెందిన వ్యవసాయ భూమి రెండెకరాల వరకు కోతకు గురైంది. ఏడాది అనంతరం కోతకు గురైన చెక్ డ్యాం వద్ద మరమ్మత్తులు చేపట్టారు. కోతకు గురైన వ్యవసాయ భూమిలో మట్టి నింపి చదును చేసి ఇచ్చారు. కాని చెక్ డ్యాం గట్టుకు మొరం వేసి రోలింగ్ చేసి బండరాళ్లతో తెట్టె పెట్టి బలంగా చేయలేదు. వాగులో నుంచి తీసిన మట్టి మొరం వేసి గట్టును పూడ్చారు. గట్టును నాణ్యతతో బలపర్చకపోవడంతో గత నెలలో 28న కురిసిన భారీ వర్షానికి గతంలో తెగిన చోటనే చెక్ డ్యాం గట్టు తెగిపోయింది. గతంలో కంటే ఈ సారి భూమి భారీ ఎత్తున కోతకు గురైందని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు ఎకరాల్లో సాగు చేసిన పొలం, బోరు బావి, మోటారు కొట్టుకుపోయాయని వారు తెలిపారు. చెక్‌డ్యాం గట్టుకు నాణ్యతతో మరమ్మతులు చేయించి కోతకు గురైన భూమిని బాగు చేయించాలని, దెబ్బతిన్న పంటకు బోరుకు నష్ట పరిహారం చెల్లించాలని బాధితులు స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ దంపతులు

డిచ్‌పల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన బెటాలియన్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరాధన, గరుడ ప్రతిష్ఠ, యాగశాల ప్రవేశము, హోమ కుంభస్థాపన, వాస్తు స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ హోమం, వాస్తు హోమం, గరుడ తత్వ హోమం, ప్రాణ ప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. టీజీఎస్పీ ఏడో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను కమాండెంట్ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పల్లకీలో యాగశాలకు మోసుకువచ్చారు. కమాండెంట్ దంపతులతో పాటు అడిషనల్ కమాండెంట్ సాంబశివరావు దంపతులు యజ్ఞకార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం డాక్టర్ నారాయణ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భేరిపూజ, దేవత ఆహ్వానము, నిత్య వాహనము, బలి హరణము, రాత్రి స్వామివారికి హనుమంత వాహన సేవ, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల్లో బెటాలియన్ అధికారులు, సిబ్బందితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ..

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్సీ వీ.గంగాధర్ గౌడ్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీజీగౌడ్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాలు, సోమవారం పుట్ట వద్ద దని పోయుట, మంగళవారం బోనాలు ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ దశగౌడ్ తెలిపారు. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్ గౌడ్, రామాగౌడ్, నరేష్ గౌడ్, స్వామిగౌడ్, కిషన్ గౌడ్, నవీన్ గౌడ్, భాస్కర్ గౌడ్, మహేష్ గౌడ్ , నడిపి నర్స గౌడ్, బోజాగౌడ్, నల్లవెల్లి సాయిలు, తిర్మన్ పల్లి మాజీ సర్పంచ్ ఏ.గంగాగౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వీజీ గౌడ్‌ను సన్మానించిన గౌడకులస్తులు

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి: గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్టు,స్కీం వర్కర్స్ కార్మికులుగా పని చేస్తున్న వారికి వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ తో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్స్, అటెండర్లు ఈ నెల 6న కలెక్టరేట్ వద్దకు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, అంజన్న, సాయిలు, పోతన్న, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.